
# ఎక్కడున్నాడో

తెలిదేవర భానుమూర్తి




ఓ రోజు శ్రీరాములు ఓ లొట్టి కల్లుతాగి, మరో లొట్టిని భుజం మీద పెట్టుకొని ఇంటికి బయలుదేరాడు. సగం దూరం వెళ్లేసరికి నిషా ఎక్కిందో ఏమోగాని అతను రోడ్డుపై కూచుండిపోయాడు.

మా ఇంటి డాబా మీద కూచుంటే రోజూ పొద్దున్నా; సాయంత్రం నాకు ఆ దృశ్యం కనబడేది. ఏ అందమైన ఆడపిల్లో వయ్యారంగా నడుస్తూ కడవలో నీళ్లు తెచ్చే దృశ్యం కాదది. అభంశుభం తెలియని పసివాడు బోసి నవ్వులతో పలకరించే దృశ్యం కాదది. ఆ దృశ్యం ఎదురైతే చాలు మనో యవనికపై పాత జ్ఞాపకాలు సాక్షాత్కారిస్తాయి. శ్రీరాములును గుర్తుకుతెస్తాయి. అతను గట్టిగా గాలివీస్తే పడిపోయేటంత సన్నగా ఉంటాడు. దువ్వకుండా జుత్తును గాలికి వదిలేస్తాడు. ఎప్పుడూ ఇన్‌షర్ట్ వేస్తాడు. అతనికి ఒక్క కన్ను మాత్రమే ఉంది. ఆ లోపాన్ని కప్పిపుచ్చుకోవడానికి అతను కళ్లద్దాలు పెట్టుకుంటాడు. అగ్గిపెట్టెపై తాళం వేస్తూ, 'అడ్డా అడ్డా అడ్డగోడల కాడా అలిగీ పన్నావురో మామా నాగులూ' అంటూ జానపదగేయాల్ని పాడుతుంటాడు. రోజూ అతను కల్లు తప్పకుండా తాగుతాడు. అతని ఇంటికి వెళితే ఛాయ్ ఇవ్వకుండా ఎంచక్కా కల్లు ఆఫర్ చేస్తాడు. శ్రీరాములు తామెరాత్ కచేరీలో క్లర్క్. ఆ కారణంగా అతన్ని మేము తామెరాత్ రాములు అంటూ పిలిచేవాళ్లం.

మా ఇంటికి కొద్ది దూరంలో ఓ తాటి చెట్టు ఉంది. మోకు చేతిలో గుజి; భుజం మీద కోల; నడుము మీద మస్తక్‌తో ఒక గీత కార్మికుడు రోజు రెండు సార్లు నాకు కనిపించే వాడు. కాల్లకు గుజి తగిలించుకొనేవాడు. మోకును నడుం చుట్టూ చుట్టుకునేవాడు. బొడ్లో దొపుకున్న కత్తితో అతను తాటిచెట్టు ఎక్కే దృశ్యాన్ని చూడటమంటే నాకు బలే సరదా. మా ఇంటిదగ్గర ఉన్న తాటిచెట్టు పొద్దాడు తాటిచెట్టు. గీత కార్మికుడు అంత పొడువైన తాటిచెట్టును అవలీలగా ఎక్కేవాడు. తాటి ఆకుల్ని కొటేసేవాడు. ఆకుల్ని అంటే మొత్తం అన్ని ఆకుల్ని కాదు. మధ్యలో ఆకుల్ని అలాగే ఉంచేవాడు. ఆ ఆకులు తాటిచెట్టుకు కిరీటంలా కనిపించేవి. తాటిచెట్టు పైకెక్కిన గీతకార్మికుడు కత్తితో గీసి లొట్టిలు కట్టేవాడు. ఇలా పొద్దున్నా, సాయంత్రం రెండుసార్లు అతను కల్లు గీసేవాడు. అప్పడప్పుడు శ్రీరాములు ఆ తాటిచెట్టు దగ్గరికి వచ్చి ఓ కల్లు లొట్టిని తీసుకొని పోయేవాడు. ఒక్కోసారి అదేచెట్టు కింద కూచుని కల్లుతాగేవాడు.

ఓ రోజు శ్రీరాములు ఓ లొట్టి కల్లుతాగి, మరో లొట్టిని భుజం మీద పెట్టుకొని ఇంటికి బయలుదేరాడు. సగం దూరం వెళ్లేసరికి నిషా ఎక్కిందో ఏమోగాని అతను రోడ్డుపై కూచుండిపోయాడు. లొట్టిని కింద దించాడు. దించి తను కూడా రోడ్డుపై కూచున్నాడు.

కూచుని- "గింతదాంక ముద్దుగ నా బుజం మీద గూసుంటాయె, ఇగ నడ్సిరా" అని అన్నాడు.

కాని కల్లు లొట్టి మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుండిపోయింది. శ్రీరాములు లేచి నిలుచుని కొద్దిదూరం నడిచి వెనక్కి చూసాడు. వెనక ఉన్నచోటునే లొట్టి ఉంది.

"నేను ముంగట్కిపోతుంటె నువ్వు ఎన్కకు బోతున్నాయె" అంటూ శ్రీరాములు తిరిగి కల్లు లొట్టి దగ్గరకు వచ్చాడు. వచ్చి తన షర్టును విప్పేసాడు. విప్పిన షర్టును వల విసిరినట్లు లొట్టి మీద విసిరి మూటకట్టాడు.

ఆ మూటను భుజం మీద పెట్టుకొని- "గిప్పుడు యాడికి బోతవో జూస్త" అంటూ ఇంటికి బయల్దేరాడు.

మా ఊర్లో జడల రాములు కల్లు కాంపౌండ్ ఉండేది. అప్పుడప్పుడు శ్రీరాములు ఆ కాంపౌండ్లోకి దూరేవాడు. అక్కడా తనివితీరకపోతే అనంతారం వెళ్లేవాడు. అనంతారం మా ఊరికి దగ్గర్లో ఉన్న పల్లెటూరు. అక్కడ తాటివనాలున్నాయి. ఓసారి లక్ష్మీనారాయణ అనే మిత్రుడు శ్రీరాములుపై ఉర్దూలో ఓ గీతం రాసాడు. దాన్ని గజల్ అంటారో ఇంకేమైనా అంటారో నాకు తెలీదు కాని అదైతే నాకింకా జ్ఞాపకం ఉంది వాడిన పువ్వుని వీడని పరిమళం లాగ. గాయం మానినా మాయని మచ్చలాగ-

"తామెరాత్ శ్రీరాములు
తన్‌ఖా హాత్ మే చలో అనంతారం ఈదులు
అస్లీ నహీ మిలేతో ఫిర్ పియో జడల్ రాములు
యహ దప్తర్ తామెరాత్ హై
యహ ఫైలోంకీ బరాత్ హై
సీసాతో హమారీ సాత్ హై!
ఆప్ హై సౌ రుపయ్‌కీ సేగెదార్
బజార్ మే ఇమ్లీ, చావల్ ఉదార్
గర్‌మే రాత్ బర్ బీబీకా ఇంతెజార్
ఆప్ అఛానక్ పగిడి పల్లి పరార్"

అంటూ శ్రీరాములుకు వినిపిస్తే 'బహుత్ ఖూబ్' అంటూ నవ్వేసాడు.

శ్రీరాములు ఏ డిగ్రీ చదువూ చదవ లేదు. కాని జీవితాన్ని చదివాడు. ఎదీ తనకు పట్టనట్లుగా ఉండేవాడు. కొంపలు మునుగుతున్నా కొండలు కూలుతున్నా ఏం మాత్రం చలించేవాడు కాదు. అతను అలా ఎలా ఉండగలుగుతున్నాడు అనే అనుమానం ఓసారి నాకొచ్చింది. అనుమాన నివృత్తి కోసం అతని ఇంటికి వెళ్లాను. అప్పుడతను తన పిల్లడితో ఆడుకొంటున్నాడు. అన్నట్టు చెప్పడం మరిచాను అతనికి ఇద్దరు పిల్లలు. ఇద్దరికీ మూడేళ్లే. అతని పిల్లలు కవలలు. కవలల్లో ఒకరు ఆడైతే మరొకరు మగ. పిల్లాడు నల్లగా బొద్దుగా ఉండేవాడు. ఆడపిల్ల తెల్లగా సన్నగా నాజూగ్గా ఉండేది. నన్ను చూడగానే శ్రీరాములు నవ్వుతూ పలకరించాడు. ఆమాటా ఈ మాటా మాట్లాడాక-

"శ్రీ రాములూ ఎప్పుడూ నువ్వు నవ్వుతూ ఎలా ఉండగలుగుతున్నావు." అని అడిగేను.

"జెరాగు జెప్త" అంటూ అతను ఇంటి లోపలకి వెళ్లాడు.

అతనే భగవద్గీతనో భాగవతాన్నో తెచ్చి వాటిలోని ఏ శ్లోకాన్నో పద్యాన్నో చదివి వినిపించి దీని వల్ల అని అంటాడేమోనని అనుకొన్నాను. కాని అతనే ఉద్గంథ్రాన్ని తేలేదు. సుబ్బరంగా ఒక కల్లు లొట్టిని తెచ్చాడు. తెచ్చి కల్లు తాగడం మొదలు పెట్టాడు. తను తాగడంమే కాకుండా తన పిల్లడికి కూడా పాలు తాగించినట్లుగా ఇంత కల్లు పట్టాడు.

"నా ప్రశ్నకు సమాధానం చెప్పలేదు." అంటూ గుర్తు చేసాను.

"ఎప్పుడో జెప్పిన గదా" అని అతను అన్నాడు.

అతనలా అనగానే నేను ఆశ్చర్యపోయాను.

" నాకేం చెప్పలేదే" అని అన్నాను.

"నేను లొట్టి తెచ్చుడు జూస్తివి. కల్లు దాగుడు జూస్తివి. ఇంకేం జెప్పాలె. గిది జెయ్యబట్కె నేను బేపికర్గ నవ్వుకుంట ఉంటున్న" అంటూ అతను కల్లు లొట్టిని చూపించాడు.

*** ***

పొట్టకూటికై ఊళ్లు తిరగడంతో మళ్లీ శ్రీరాములును చూసే భాగ్యం నాకు కలగలేదు. ఇప్పుడు అతనెక్కదున్నాడో ఏం చేస్తున్నాడో. ఉన్నాడో లేడో. అతనెక్కడున్నా తాటిచెట్టును చూస్తే చాలు, కల్లు లొట్టి కనిపిస్తే చాలు కళ్లల్లో మెదులుతాడు.

'గండాలు బాపేటి తల్లో అండాలమ్మ
నిండు ముత్తయిదువమ్మ
నీ చెల్లే ముత్యాలమ్మ'

అంటూ అతను పాడే జానపదగీతం కొండను కమ్ముకున్న మంచులాగ నా గుండెను కమ్మేస్తుంది.

---

## ప్లాపీ గైడెన్స్‌లో వంట

ఆంటీ: ఏరా చింటూ, ఇందాక మీ అమ్మ గ్లాసుడు పంచదార అప్పు పట్టుకెళ్ళింది కదా... మళ్ళీ నువ్వొచ్చావేం!

చింటూ: మీ వంటల 'ప్లాపీ' ఓసారి బదులిమ్మంది. అది చదివి స్వీట్సు చేసుకున్నాక మళ్ళీ ఇచ్చేస్తుందంట.

ఆంటీ: ...ఆఁ!!?

-యు. చిట్టిబాబు, కొత్తగూడెం